ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

శుక్రవారం 28 నవంబరు www.prajaswaramdaily.com 3 pm




దేశ రక్షణ విషయంలో ఎన్నటికీ వెనుకడుగు వేయదు. ఆపరేషన్ సిందూర్‌లో మన సంకల్పాన్ని ప్రపంచం చూసింది. మన మిషన్ సుదర్శన చక్ర.. శత్రువులను నాశనం చేస్తుంది. శ్రీకృష్ణుడి స్ఫూర్తితో దేశానికి సుదర్శన చక్ర భద్రతా కవచాన్ని ఏర్పాట్లు చేయడమే ఉద్దేశం.

# తెలంగాణలో స్థానిక ఎన్నికలకు లైన్ క్లియర్

### జీవో నెం.46పై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్, ప్రజాస్వరం : తె లంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది. ఎన్నికల్లో రిజర్వేషన్లపై ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.46పై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ఈ జీవోను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై శుక్రవారం విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం, ప్రస్తుత దశలో ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది.

ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కలిపి రిజర్వేషన్లు 50 శాతం మించరాదని నిర్దేశిస్తూ ప్రభుత్వం నవంబర్ 22న జీవో 46ను జారీ చేసింది. అయితే, ఈ జీవో చట్టవిరుద్ధంగా ఉందని, దీని ఆధారంగా ఎన్నికలు నిర్వహించకుండా నిలిపివేయాలని కోరుతూ పలు వెనుకబడిన కుల సంఘాలు హైకోర్టును ఆశ్రయించాయి. విచారణ సందర్భంగా, ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యాక కోర్టులు జోక్యం చేసుకోలేవని ఎన్నికల సంఘం తరపు న్యాయవాది చేసిన వాదనతో ధర్మాసనం ఏకీభవించింది. సబ్-కేటగిరీ రిజర్వేషన్లు లేవనే కారణంతో ఎన్నికలను ఆపాలని కోరుతున్నారా? అని పిటిషనర్లను ప్రశ్నించింది.



ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, ఈ వ్యవహారంపై ఆరు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేస్తూ విచారణను వాయిదా వేసింది.



# చిరంజీవి ఐ అండ్ బ్లడ్ బ్యాంక్‌కు గుడ్ న్యూస్

### విదేశీ విరాళాలు సేకరించేందుకు మార్గం సుగమం

### అనుమతి ఇచ్చిన కేంద్రం .. అధికారుల వెల్లడి

హైదరాబాద్, ప్రజాస్వరం : చిరంజీవి నడుపుతున్న ఐ అండ్ బ్లడ్ బ్యాంక్ కు గుడ్ న్యూస్ అని చెప్పొచ్చు. స్వదేశంలోనే కాకుండా విదేశీ విరాళాలు కూడా స్వీకరించేందుకు అనుమతి ఇచ్చినట్లుగా కేంద్ర ప్రభుత్వం అధికారులు వెల్లడించారు. ఇటీవల విదేశీ విరాళాలకు ఎఫ్‌సీఆర్ఏ పర్మిషన్ తప్పనిసరిగా తీసుకోవాలని కేంద్రం నిబంధనల్లో కీలక మార్పులు చేసింది. విదేశీ విరాళాల నియంత్రణ చట్టం-2010 కింద ఆయా ట్రస్ట్‌లు తమ పేర్లను పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించింది. అయితే, నిబంధనల మార్పుతో చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాయగా.. విదేశీ విరాళాలు స్వీకరించేందుకు ఆమోద ముద్ర వేశారని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.



# కూరగాయలు, పండ్లకు హబ్‌గా ఏపీ: సీతారామన్

అమరావతి, ప్రజాస్వరం : అమరావతి రాజధాని నిర్మాణ పనులు వేగం అందుకున్నాయి. రాజధాని నిర్మాణానికి భూములిచ్చి రైతులు పెద్ద త్యాగం చేశారు అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ అన్నారు. రాజధాని నిర్మాణ పనులు మళ్లీ ప్రారంభించడం ఒక యజ్ఞం లాంటిదని అన్నారు. అమరావతిలో 15 బ్యాంకులు, బీమా సంస్థల ప్రధాన కార్యాలయాల నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఒకే చోట ప్రభుత్వరంగ బ్యాంకులు, బీమా కంపెనీలు ఉండటం చాలా అరుదు అని చెప్పారు. భవిష్యత్‌లో రాజధాని నిర్మాణమంటే అమరావతిని స్ఫూర్తిగా తీసుకుంటారని అన్నారు. కూరగాయలు, పండ్లకు ఏపీని హబ్‌గా చేసి, ఉత్పత్తుల రవాణాకు సీఎం ఆలోచిస్తున్నారన్నారు. అందుకు బ్యాంకులు సహకరించాలన్నారు.. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకర్లు తోడ్పాటు ఇవ్వాలన్నారు.

# కేసీఆర్ దీక్ష ఒక నాటకం

### దీక్షా దివస్ పేరిట మరోసారి సెంటిమెంట్ రాజేసేందుకు యత్నం

### పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకున్న కేసీఆర్ కుటుంబం

### టీపీసీసీ చీఫ్ మహేశ్

హైదరాబాద్, ప్రజాస్వరం తెలంగాణ కోసం అప్పుడు కేసీఆర్ చేసిన ఒక నాటకమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ విమ ర్శించారు. తెలంగాణ సెంటిమెంట్‌ను కేసీఆర్ వాడుకున్నారని, ఇప్పుడు దీక్షా దివస్ పేరుతో మరోసారి సెంటిమెంట్ రాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ కోసం కేసీఆర్ చేసిన దీక్ష ఒక నాటకమన్నారు. హైదరాబాద్ లో ఆయన విలేకరులతో ఆయన మాట్లాడారు. కేసీఆర్ మూడు రోజులకే దీక్ష ముగించి పలాయనం చిత్తగించారన్నారు. దీక్షను మధ్యలోనే విరమిస్తే విద్యార్థి సంఘాల నుంచి వ్యతిరేక



వచ్చిందన్నారు. కేవలం కేసీఆర్ వల్ల తెలంగాణ రాలేదని, కాంగ్రెస్ వల్ల తెలంగాణ వచ్చిందన్నారు. పొట్టి శ్రీరాములు చేసిన దీక్షకు.. కేసీఆర్ దీక్షకు పొంతన లేదన్నారు. ఉద్యమంలో పాల్గొన్న పేదలు, విద్యార్థులు, ఎస్సీలు, ఎస్టీలు ఆత్మార్పణం చేసుకున్నారన్నారు. వారి త్యాగాల వల్ల వచ్చిన రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబం పదేళ్లు దోచుకుందన్నారు. సోనియా గాంధీ వల్లే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందన్నారు.

# దురాగతాలకు పాల్పడే వారిని అణచివేయాలని గీత బోధిస్తుంది

### శ్రీ కృష్ణుడి సందేశమే.. రిజర్వేషన్ల చట్టానికి మార్గనిర్దేశనం

### నయా భారత్ ఎలాంటి బెదిరింపులకు తలొగ్గదు

### ప్రధాని మోదీ

**ఉడిపి శ్రీకృష్ణ మఠంలో లక్ష కంఠ భగవద్గీతకు హాజరు**

**శ్లోకాల పఠన**

బెంగళూరు, ప్రజాస్వరం : నయా భారత్ ఎలాంటి బెదిరింపులకు తలొగ్గదని, పౌరుల రక్షణ కోసం ఎంత దూరమైనా వెళ్తుందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. "గీతలో శ్రీకృష్ణుడి బోధనలు ప్రతి యుగానికి సంబంధించినవి. మన జాతీయ విధానాన్ని అవి నిర్దేశిస్తాయి. ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలని కృష్ణుడు బోధించాడు. 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్', 'సర్వజన్ హితయ' అనే నినాదాలు గీత నుంచి స్ఫూర్తి పొందినవే. మహిళల రక్షణపై శ్రీ కృష్ణుడి సందేశమే.. రిజర్వేషన్ల చట్టానికి మార్గనిర్దేశనం. శాంతి, సత్యాన్ని సాధించడం కోసం అవసరమైతే దురాగతాలకు పాల్పడే వారిని అణచివేయాలని గీత మనకు బోధిస్తుంది" అని మోదీ తెలిపారు.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం కర్ణాటకలో పర్యటిస్తున్నారు. ఉడుపిలోని ప్రసిద్ధ శ్రీకృష్ణ మఠానికి విచ్చేసిన ఆయన లక్ష కంఠ భగవద్గీత పఠనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భగవద్గీత శ్లోకాలను ప్రధాని పఠించారు. ఆయనతోపాటు లక్ష మంది భక్తులు, గాయకులు ఏకకాలంలో ఈ శ్లోకాలను పఠించారు. అనంతరం మధ్వసరోవరంలో తీర్థ ప్రోక్షణ అనంతరం ఆలయంలో కనకన కిండి నుంచి శ్రీకృష్ణుడిని మోదీ దర్శించుకోనున్నారు. అష్టమఠాలకు నేతృత్వం వహిస్తున్న పీఠాధిపతుల ఆశీర్వచనం అనంతరం ప్రసాదాన్ని స్వీకరిస్తారు.

# తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అరెస్ట్

కామారెడ్డి, ప్రజాస్వరం : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అరెస్ట్ అయ్యారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డిలో కవిత ఆధ్వర్యంలో రైలురోకో నిర్వహించారు. పట్టాలపై బైఠాయించి నిరసన తెలిపారు. కవితను, పలువురు జాగృతి నేతలను పోలీసులు అరెస్టు చేశారు. కార్యకర్తలను పోలీసులు అడ్డుకునే క్రమంలో తోపులాట జరిగి ఆమె చేతికి స్వల్ప గాయమైంది.



# దేవ్‌జీ సహా 50 మందిని కోర్టులో హాజరుపరచాలి

### మావోయిస్టుల డిమాండ్

### బూటకపు ఎన్‌కౌంటర్లకు నిరసనగా 30న దండకారణ్యం బంద్

ఛత్తీస్‌గఢ్, ప్రజాస్వరం : మావోయిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు దేవ్‌జీతో పాటు తమకు చెందిన మరో 50 మంది నాయకులు, కార్యకర్తలు పోలీసుల అదుపులో ఉన్నారని దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డీకేఎస్‌జడ్‌సీ) సంచలన ఆరోపణలు చేసింది. అదుపులో ఉన్న వారందరినీ తక్షణమే కోర్టులో హాజరుపరచాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు డీకేఎస్‌జడ్‌సీ కార్యదర్శి వికల్ప్ పేరుతో నిన్న ఓ ప్రకటన విడుదలైంది. ఈ నెల 22వ తేదీతో ఉన్న ఈ లేఖలో, ఇటీవలే జరిగిన హిడ్మా ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టు పార్టీ స్పందించింది. ఆంధ్రప్రదేశ్‌లోని మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో ఈ నెల 18న హిడ్మా సహా ఆరుగురిని బూటకపు ఎన్‌కౌంటర్‌లో చంపేశారని ఆరోపించింది. ఆ తర్వాతి రోజే, అంటే నవంబర్ 19న, అదే ప్రాంతంలో సురేశ్, శంకర్ సహా మరో ఏడుగురిని కూడా ఇలాగే హత్య చేశారని లేఖలో



పేర్కొంది.

ఈ బూటకపు ఎన్‌కౌంటర్లకు నిరసనగా ఈ నెల 30వ తేదీన ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం బంద్‌ను విజయవంతం చేయాలని మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది. ప్రస్తుతం ఈ ప్రకటన తీవ్ర కలకలం రేపుతోంది. అయితే, మావోయిస్టుల ఆరోపణలపై పోలీసుల నుంచి ఇంకా అధికారిక స్పందన రావాల్సి ఉంది.